క్లుప్తంగా

కుల వివక్షతను రూపుమాపాలి

మన్సూరాబాద్: స్వతంత్ర భారతంలో అంటరానితనం నుంచి కులవివక్షతగా రూపుమారిన ఒక సాంఘిక దురాచారం నేటికీ కొనసాగుతుందని, కుల వివక్షతను రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉందని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌లో బుధవారం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రాజకీయరంగంలో బీసీలకు సముచిత స్థానం లేదని, కుల వివక్షతన చూపిస్తూ రాజ్యాధికారానికి దూరంగా ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌ను దుబారా చేస్తున్నారని విమర్శించా రు. కార్యక్రమంలో నాయకులు కొండని లక్ష్మ ణ్, భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, పాండుయాదవ్, శ్రీకర్‌కుమార్, నర్సింగ్‌రావు, రవికుమార్, వెంకటేష్, ఆంజనేయులు శ్రీనివాస్, సందీప్‌కుమార్, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

24న ఉపన్యాస పోటీలు

నాగోలు: 'నాకు నచ్చిన స్వాతంత్ర్య సమర యోధుడు' అనే అంశంపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సెప్టెంబర్ 24న ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు చిమ్మపూడి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి తెలిపారు. ఉపన్యాస పోటీలలో పాల్గొన్న విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్: 97041 77270లో సంప్రదించాలని కోరారు.

కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, వంకాయ 20, బెండ 23, పచ్చి మిర్చి 40, కాకర 26, బీర 23, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 35, దొండ 18–23, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 33, ఆలు 21, దోస 23, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 18 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.



చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జునకు రాఖీ కడుతున్న చిన్నారి

సందడిగా రక్షాబంధన్

పాఠశాలల్లో రాఖీలు కట్టిన చిన్నారులు | పలు ప్రాంతాల్లో సంబరాలు

నాగోలు: కొత్తపేట డివిజన్ న్యూ నాగోలు కాలనీలోని కిండర్ క్లే ప్రీ స్కూల్‌లో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఇతర పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టారు. నాగోలులోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు బ్రహ్మకుమారి ప్రసన్నకుమారి సుజాత రాఖీ కట్టారు. కార్యక్రమంలో నేతలు పుల్లారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యురాళ్లు తేజస్వీ, సుజాత జీహెచ్‌ఎంసీ బీ జేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడ ర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిలకు వారి వారి కార్యాలయంలో రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు భూపతిరెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి ప్రసన్నసుజాత

కేంబ్రిడ్జ్ స్కూల్‌లో...

సైదాబాద్: పండుగలు, ఉత్సవాల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వివరించాలని ప్రముఖ విద్యావేత్త, కేంబ్రిడ్జ్ విద్యా సంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ సూచించారు. బుధవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాఖీ వేడుకలను నిర్వహించుకున్నారు. ఉన్నత తరగతి విద్యార్థినులు సమూహంగా ఏర్పడి రాఖీలు తయారు చేశారు. ప్రాథమిక తరగతుల చిన్నారులు ఒకరికొకరు ఉత్సాహంగా రాఖీలు కట్టుకొని మిఠాయిలు తినిపించుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శంతన్‌కుమార్ మాట్లాడుతూ... సోదర సోదరీమణుల అనురాగానికి ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు



న్యూనాగోలులోని కిండర్ క్లే ప్రీ స్కూల్‌లో పోలీసులకు రాఖీలు కడుతున్న చిన్నారులు



మన్సూరాబాద్‌లో...

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకున్నామన్నారు. తాను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చానని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణ, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, హనుమాన్ టెంపుల్ ధర్మకర్తలు నారగోని శ్రీనివాస్‌యాదవ్, ముద్ద కళ్యాణ్, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, కాలనీ ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అద్దెకు తీసుకున్న కార్ల తాకట్టు

- నిందితుడి సహా తాకట్టు పెట్టుకున్న వ్యక్తి అరెస్టు
- 10 కార్ల స్వాధీనం.. పరారీలో మరో వ్యక్తి



నిందితులు నాగరాజు, వెంకటేశ్

హస్తినాపురం: కార్లను వాటి యజమానుల దగ్గర అద్దెకు తీసుకుని నెలనెల కిరాయి డబ్బులు ఇవ్వకుండా ఏకంగా అద్దెకు తీసుకున్న కార్లనే వేరేవ్యక్తి దగ్గర తాకట్టు పెట్టిన వ్యక్తిని, తాకట్టు పెట్టుకున్న మరో వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి సమాచారం మేరకు... రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బట్టు జానయ్య చింతల్‌కుంటలో నివాసం ఉంటూ కారును సెల్ఫ్ డ్రైవింగ్‌కు ఇచ్చే వ్యక్తికి అద్దెకు ఇస్తుంటాడు. కాగా కర్మన్‌ఘాట్ దుర్గాకాలనీకి చెందిన నాగరాజు(34) బైరామల్‌గూడలో శివప్రకాశ్ ట్రావెల్స్ అనే సెల్ఫ్ డ్రైవింగ్ బిజినెస్ చేస్తూ సుమారు 10 మంది దగ్గర కార్లను అద్దెకు తీసుకుని సెల్ఫ్ డ్రైవింగ్ వ్యాపారం చేస్తూ యజమానులకు ప్రతినెలా కిరాయి డబ్బులు ఇస్తుండేవాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నాగరాజు ఐపీఎల్‌లో బెట్టింగులు పెట్టి డబ్బులు పోగొట్టుకున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నాగరాజు ఇతరుల దగ్గర కిరాయికి తీసుకున్న కార్లని వడ్డీ వ్యాపారం చేసే సూర్యాపేట జిల్లా బేతవోలు గ్రామానికి చెందిన బెక్కం వెంకటేశ్(29) దగ్గర 10 శాతం వడ్డీ లెక్కన డబ్బులను తీసుకుని పెద్దఎత్తున కార్లను తాకట్టు పెట్టాడు. ఇలా కార్ల యజమానులను మోసం చేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడని తెలుసుకొని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారించగా తాను చేసిన తప్పును ఒప్పుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నాగరాజు, వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి 10 కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు రామారావు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

జల్సాల కోసం కారు చోరీ: ఇద్దరి అరెస్టు

నాగోలు: జల్సాల కోసం కారును దొంగిలించిన ఇద్దరిని బుధవారం నాగోలు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... నాగోలుకు చెందిన మహేష్, బండి మనోజ్‌కుమార్ జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేసుకున్నారు. పాతబస్తీ, షాహిన్‌నగర్‌కు చెందిన అజయ్ జమీ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ రాత్రి ఉప్పల్ నుంచి షాహిన్‌నగర్‌కు వెళ్తుండగా నాగోలు ఫ్లైఓవర్ వద్ద స్విగ్గీ డెలివరీ బాయ్ కారు ఆపి తనకు పర్స్ దొరికిందని... అందులోని పర్స్ యజమానికి ఫోన్ చేయించాడు. ముందుస్తు ప్లాన్ ప్రకారం అక్కడి వచ్చిన మహేష్, మనోజ్‌కుమార్‌లు అజమ్ దగ్గర ఉన్న కారు దొంగతనం చేసి అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. మంగళవారం రాత్రి వారి అరెస్టు చేసి వారి నుంచి దొంగతనం చేసిన కారు, మరో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన కారు ఇతర ప్రాంతంలో విక్రయించి వచ్చిన డబ్బులతో మద్యం సేవించి జల్సాలు చేయాలని ప్లాన్ చేసినట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు వెల్లడించారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలి


నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలో చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు కూలిపోయేలా ఉన్నాయని వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణతో కలసి విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ... శివమ్మ నగర్ కాలనీ, భరత్ నగర్, కొత్తపేట గ్రామం, రాజీవ్ గాంధీ నగర్, వివిధ కాలనీలలోని చాలా స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఇళ్లకు అందేంత ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన నెలకొందన్నారు. అనంతరం స్ట్రీట్ లైట్ ఏఈ పున్న నాయక్‌తో వెలగని దీపాల విషయంపై చర్చించారు. చాలా చోట్ల స్ట్రీట్ లైట్లు లేక చీకటిగా ఉన్నాయని వాటిని వెంటనే గుర్తించి నూతన స్ట్రీట్ లైట్లు అమర్చాలని ఆయన సూచించారు.



సరూర్‌నగర్ విద్యుత్ డీఈకి వినతిపత్రమిస్తున్న పవన్‌కుమార్

మాలలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: మాలలు తమ మేధాశక్తి, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో రాణించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జె.చెన్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన మరిపల్లి శ్రీకాంత్‌ను మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ.. నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో మాలలు ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలను పనులకు పంపకుండా ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. మాల మహానాడు నేతలు మన్నె శ్రీధర్, బైండ్ల శ్రీనివాస్, విక్రమ్‌కుమార్, నవీన్‌కుమార్, కళ్యాణ్ తదితరులున్నారు.



టెట్, డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ టెస్ట్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా టెట్, డీఎస్సీలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లాల వారీగా ఉచిత ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ హైదరాబాద్, సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ తెలిపారు. టెట్ అభ్యర్థులకు సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు సబ్జెక్ట్ వారీగా, సెప్టెంబర్ 8 నుంచి 12 టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు ప్రతి ఆదివారం గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామని అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9246208422, 8885555202, 8008954440 నంబర్లను సంప్రదించాలన్నారు.

బస్తీ దవాఖానాలో తనిఖీలు

నాగోలు: జైపురికాలనీలోని బస్తీ దవాఖానాలో బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య శాఖ అధికారి పూట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మహిళలకు అందిస్తున్న ఆరోగ్య మహిళ పథకం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం జరిగే ఆరోగ్య మహిళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానికులను శ్రీనివాస్ సూచించారు. మహిళలకు ప్రత్యేకంగా 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని సిబ్బంది అధికారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జిల్లాలో మొదలైన జ్వర సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: రోజురోజుకూ పెరుగుతున్న వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి పెద్దచేసినట్‌లైతే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ రోడ్డులోని దేవకమ్మతోట కాలనీలో కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ... మొక్కలను పెంచితే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. భవిష్యత్తరాలకు ప్రాణవాయువు సమృద్ధిగా లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజుగౌడ్, గొడ్డలి కృష్ణ, దయ్యాల వెంకటేష్, మమతా మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పండాల రాజశేఖర్‌గౌడ్, మర్యాద రోహిత్‌రెడ్డి, లోకసాని హరీష్‌రెడ్డి, ప్రశాంత్, మహేశ్, శరత్, ఉమేశ్, ధర్వేశ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సురూటు పునరుద్ధరణ

అంబర్‌పేట: డివిజన్ నుంచి రాకపోకలు సాగించే సామాన్యులకు ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించడం హర్షనీయమని కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం ఉప్పల్ ఆర్టీసీ డిపో అధికారుల సహకారంతో నిలిచిపోయిన బస్సు ట్రిప్పును ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కోవిడ్‌కు ముందు పటేల్‌నగర్ నుంచి నడిచిన బస్సును నిలిపేశారన్నారు. పలు దఫాలుగా ఉప్పల్‌డిపో అధికారులకు సమస్యను దృష్టికి తీసుకురావడంతో రూట్‌నెంబర్ 113ఎం ను పునరుద్ధరించడం హర్షణీయమన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, డ్రైవర్ సిద్ధార్థరెడ్డి, కండక్టర్ హేమలతను కార్పొరేటర్ సత్కరించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కాచిగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ కాచిగూడ డివిజన్‌కు సహకరించాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని చెప్పల్‌బజార్‌లో రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ఆమె తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు రోడ్లపై ఇష్టానుసారంగా వ్యర్థాలను వేయొద్దని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. లేదంటే నిత్యం రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్రవంతి, బీజేపీ నేతలు బి.బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, ఆర్.సంతోష్ తదితరులున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

అంబర్‌పేట: పోక్సో చట్టం కింద కేసు నమోదైన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఈ ఘటన బుధవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకు చెందిన జి.నర్సింగ్‌రావు(50)పై 2018లో అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అప్పటి నుంచి విచారించిన న్యాయస్థానం బుధవారం అతడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.8 వేల జరిమానా విధించింది. స్పెషల్ కోర్టు ఫర్ పోక్సో యాక్ట్, 12వ ఏఎంఎస్‌జే హైదరాబాద్ న్యాయమూర్తి టి.అనిత శిక్షను ఖరారు చేశారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఆర్యవైశ్య భవన్‌కు స్థలం కేటాయించాలి



మంత్రి సబితారెడ్డికి బొకె అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

మీర్‌పేట: ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం బాలాపూర్ మండల సంఘం ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమే శ్వరి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్ గు ప్తా మాట్లాడుతూ మహేశ్వరం బీఆర్‌ఎస్ టికెట్‌ను మంత్రికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మంత్రి గెలుపునకు కృషి చేస్తామని సంఘం ప్రతినిధులు అన్నారు. అనంతరం మంత్రి స్పంది స్తూ సంఘం భవనానికి స్థలం కేటాయించేలా చర్య లు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పా రు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్‌గుప్తా, కోశాధికారి గందే వెంకటేశ్వర్లుగుప్తా పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించే మహిళలకు ఆఫర్

బోడుప్పల్: రాఖీ పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలకు తెలంగాణ ఆర్టీసీ ఆఫర్ ప్రకటించినట్లు చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత వెల్లడించారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతూ రాఖీ పండగ రోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలు తమ టిక్కెట్ వెనుక వైపు తన పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. అనంతరం డ్రా తీసి గెలిచిన మహిళలకు విలువైన బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

కాచిగూడ: గోల్నాక డివిజన్ న్యూ కృష్ణానగర్ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం న్యూ కృష్ణానగర్ బస్తీవాసులు ఎమ్మెల్యేను ఆయన నివాసం వద్ద కలిసి సమస్యలను వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక ఇబ్బందులు పడుతూ.. వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వామ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ అన్నారు. ఎన్నికలప్పుడే పార్టీలు, జెండాలు ఉండాలే తప్పా.. మిగతా సమయంలో ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్ గాంధీనగర్ కమ్యూనిటీహాల్‌లో రాంనగర్ వార్డు కార్యాలయాన్ని పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వార్డు కార్యాలయాల ముఖ్య ఉద్దేశం ప్రజల వద్దకే అధికారులు అందుబాటులో ఉండటమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానికంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అధికారులు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని కోరారు. నియోజకవర్గంలోని స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ సహకారంతో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి అధికారులకు కూడా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఇలాంటి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్ కె.రవిచారి, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజెస్, దామోదర్‌రెడ్డి, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఐలినేని కిషన్‌రావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, బీజేపీ నాయకులు గడ్డం నవీన్, కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ శంఖారావ సభను జయప్రదం చేయండి



ఆహ్వాన పత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి, తదితరులు

హుడాకాంప్లెక్స్: పద్మశాలీ సమాజ సంక్షేమం, అభివృద్ధి రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'పద్మశాలీ శంఖారావ' సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలి మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్ మండల కేంద్రం కొత్తపేట, హుడాకాంప్లెక్స్, కృష్ణాపురంలలో పద్మశాలీశంఖారావం ఆహ్వాన పత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో సెప్టెంబరు 3న జరిగే పద్మశాలీ శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భారతమ్మ, చంద్రకళ, చిలుకూరి మాధవి, కర్నాటి మాధవి, ఉమా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్ రెడ్డి

పహాడీషరీఫ్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి వెంకట్ రెడ్డి అన్నారు. షాహిన్‌నగర్‌లోని ఓస్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు చెప్పొదన్నారు. ఫోన్లో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించొదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9505507616 | 9912220363 | 9912220365